# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ శ్రీ సత్యసాయి బాబా సేవా కార్యక్రమాల స్ఫూర్తితో ప్రభుత్వం పాలన చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ ప్రకృతి సేద్యంలో రాష్ట్రం ముందుడాలని.. అప్పుడే రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఈరోజు జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు.
- ❖ శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై ఐసీఎంఆర్ పరిశోధనలు చేపట్టనుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

==================

శ్రీ సత్యసాయి బాబా సేవా కార్యక్రమాల స్ఫూర్తితో ప్రభుత్వం పాలన చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈరోజు నిర్వహించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతోత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తో కలిసి ప్రధానమంత్రి పాల్గొన్నారు. ముందుగా సత్యసాయి బాబా మహాసమాధిని ప్రధానమంత్రి దర్శించుకున్నారు. అనంతరం సత్యసాయి సత్యసాయి బాబా స్మారక పోస్టల్ స్టాంప్ ను, నాణేన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ... సత్య సాయిబాబా ఇచ్చిన సందేశాలు యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయని, ముఖ్యంగా “అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు..” నినాదం చాలా మంది జీవితాలను సమూలంగా మార్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం కూడా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ముఖ్యంగా ఆడపిల్లలకు మంచి విద్య, బోధనను అందిస్తూ.. వారికి అనేక పథకాల ద్వారా మంచి భవిష్యత్‌ను కల్పిస్తోందన్నారు. ఇందులో భాగంగానే సుకన్య సమృద్ధి యోజన ద్వారా సుమారు 4 కోట్ల మంది ఆడ పిల్లలు ఈ పథకంలో ఎన్‌రోల్ అయ్యారని చెప్పారు. ప్రతి ఒక్కరు వోకల్ ఫర్ లోకల్ ను దృష్టిలో పెట్టుకొని దేశం వికసిత్ భారత్ వైపుకు అడుగులు వేసేందుకు అందరి కృషి ఎంతో అవసరమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=================

రైతులు డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పి.ఎం. కిసాన్ నిధులను కోయంబత్తూరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఈరోజు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని వై.ఎస్.ఆర్ కడప జిల్లా పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన రైతుసేవలో ప్రజావేదిక నుండి ముఖ్యమంత్రి వీక్షించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రకృతి సేద్యంలో రాష్ట్రం ముందుడాలని, అప్పుడే రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం పంచ సూత్రాలు అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను, సాంకేతికతను రైతులు అనుసరించాలని ముఖ్యమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=================

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీయ్యమ్మవలస అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఈరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసు అధికారులు ప్రకటించారు. పేలుడు సామగ్రిని కూడా ఘటనా స్థలంలో స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టు కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా వజ్ర కొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు కీలక నేత మెట్టూరి జోగారావు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.

=================

శ్రీకాకుళం జిల్లా ఉద్ధానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధన చేపట్టేందుకు ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాల వ్యవధిలో ఈ పరిశోధన పూర్తి చేసేందుకు ఐసీఎంఆర్ 6.2 కోట్ల రూపాయలను గ్రాంటు రూపంలో ఇస్తుందని వెల్లడించారు. `శ్రీకాకుళం కిడ్నీ రీసెర్చ్ ప్రాజెక్ట్` పేరుతో జరిగే ఈ పరిశోధనలో ప్రధానంగా ఒకటి, రెండు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడే వారిని గుర్తించి, ముందుగానే చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే కిడ్నీ వ్యాధుల మూలాలు కనుగొనడం ద్వారా ఉద్దానం ప్రాంతంలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలోనే పరిశోధన ప్రారంభమవుతుందని సత్యకుమార్ యాదవ్ ఆ ప్రకటనలో తెలిపారు.

విరామం

=================

భారతదేశ ఐక్యతను ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ప్రపంచానికి చాటి చెప్పారని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురంలో నిర్వహించిన సర్దార్@150 ఐక్యత పాదయాత్రలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కృషి వలనే అఖండ భారత్ సాధ్యమైందన్నారు. "పట్టు పట్టరాదు.. పట్టి విడువరాదు.." అనే సూత్రంతో ఆయన ఎన్ని అడ్డంకులు వచ్చినా అఖండ భారతదేశాన్ని సుసాధ్యం చేశారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో కుల, మత, భాషా బేధం లేకుండా అందరూ కలిసి మెలిసి దేశానికి సేవ చేయాలని కోరారు.

అలాగే గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన సర్దార్@150 ఐక్యత నడకలో స్థానిక పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లాతో కలసి పాల్గొన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విభజిత భారతాన్ని ఏకతా సూత్రంలో కట్టిన సమైక్య భారత్ నిర్మాతగా నిలిచిపోయారని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 18 సెకన్లు)

=================

రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 55.79 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఈరోజు పర్యటించిన మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ చేసి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో టోల్ ఫ్రీ నెంబర్ ను పెట్టి అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ద్వారా రైతులకు సాగునీటిని అందించడంతో పాటు వివిధ కార్యక్రమాలను అమలు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు.

=================

విశాఖపట్నంలోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె. శోభారాణి తెలిపారు. మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె వెల్లడించారు. సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సూచనల మేరకు పలు సంస్కరణలు చేశామని, భక్తులకు అనువైన విధంగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. దర్శనాలకు సంబంధించిన సమాచారం, ఇతర వివరాలు ప్రజలకు తెలిసేలా లైవ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

=================

మహిళలు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై పురోగతి సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దుర్గాబాయి దేశ్ ముఖ్ ఉమెన్ సెంటర్ ఫర్ స్టడీస్ ఆధ్వర్యంలో మహిళల భద్రతను నిలబెట్టడం, విశాఖపట్నం విజయానికి బెంచ్ మార్కింగ్, భవిష్యత్‌ను నిర్ధారించే అంశాలపై ఈ రోజు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాయపాటి శైలజ మాట్లాడుతూ... ఇటీవల నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ నిర్వహించిన సర్వే 'నారి 2025' నివేదికలో విశాఖపట్టణానికి అత్యంత సురక్షిత నగరంగా ర్యాంక్ రావడం సంతోషదాయకమన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి ఇటీవల జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో చెప్పారన్నారు. ఈ ర్యాంకింగ్ ను కొనసాగించేందుకు, అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో కూడా వర్తింప చేయాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయాల్లో ఉన్న విమెన్ సెంటర్ ఫర్ స్టడీస్ తో కలిసి మహిళా కమిషన్ ఒక కార్యక్రమం ప్రారంభించిందన్నారు.

=================
=================